

భవన నిర్వాహకులతో మాట్లాడుతున్న కార్పొరేషన్ సిబ్బంది

కౌలు కష్టాలు

- అప్పుల ఊబిలో అన్నదాతలు
- ప్రతిఏటా పెరుగుతున్న పెట్టుబడులు..
- అర్హత ఉన్నా అందని సాగుహక్కు పత్రాలు
- కూలీలుగా మారుతున్న రైతులు



● మెళియాపుట్టి మండలం జంతూరు గ్రామానికి చెందిన బందపల్లి గవిరేష్ గతేడాది రెండు ఎకరాల భూమిని సాగుకు తీసుకున్నారు. అప్పు చేసి.. వరిసాగు చేపట్టారు. కాగా.. వర్షాలు సక్రమంగా కురవక పంట నష్టపోయారు. ఆయనకు కౌలు సాగు పత్రాలు కానీ, పంట రుణాలు కానీ అందలేదు. ఈ ఏడాది కౌలు సాగును వదిలి.. ఉపాధి కోసం వలసబాటకు సిద్ధమయ్యారు.

● మెళియాపుట్టి మండలం జలగలింగు పురం గ్రామానికి చెందిన నడిమింటి ఉమాపతి.. గతేడాది కుద్దవ ప్రాంతంలో ఐదు ఎకరాలను కౌలుకు తీసుకున్నారు. ఆయనకు సీసీఆర్ కార్డు వచ్చినా.. రుణం మాత్రం అందలేదు. దీంతో ఈ ఏడాది కౌలు చేయడానికి ఆసక్తి చూపడం లేదు.

(ఇచ్ఛాపురం/మెళియాపుట్టి)

వైసీపీ పాలనలో రైతులకు సాగు భారమైంది. ఐదేళ్లుగా అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు ఏటా పెరుగుతున్న సాగు పెట్టుబడులతో సతమతమవుతున్నారు. ఇంకోవైపు తెగుళ్ల దెబ్బకు సక్రమంగా పంటలు పండక నష్టపోతున్నారు. పంటలకు గిట్టుబాటు ధర లేక అల్లాడిపోతున్నారు. కౌలురైతు గుర్తింపు కార్డులు లేకపోవటంతో ప్రభుత్వం రాయితీలు కోల్పోతున్నారు. వ్యవసాయానికి పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి.. నష్టపోతున్నారు. ఈనేపథ్యంలో వ్యవసాయాన్ని వదిలి ప్రత్యామ్నాయ మార్గాల వైపు చూస్తున్నారు. ప్రధానంగా కౌలు రైతులు ఉపాధి కోసం వలస పోతున్నారు. కొంతమంది భవన నిర్మాణ రంగ కూలీలుగా మారుతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో గతేడాది 3,84,216 ఎకరాల్లో వరి సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 13వేల మంది కౌలు రైతులు ఉండగా.. 7,632 మంది సీసీఆర్ కార్డులు పొందారు. గత ప్రభుత్వం 1,592 మంది రైతులకు రూ.20లక్షల మాత్రమే రుణాలు అందజేసింది. ఈ-క్రాప్‌లో నమోదైన వారికే పెట్టుబడి రాయితీ కల్పించింది. గుర్తింపు పత్రాలు లేనివారికి రాయితీ రాలేదు. పెట్టుబడి సాయం కూడా అందలేదు. గతంలో రైతులు భూమిని కౌలుకు తీసుకుని.. యజమానికి ఎకరాకు 20 బస్తాల వరకు పండించి ఇచ్చేవారు. ప్రస్తుతం పెట్టుబడి పెరిగింది. ప్రభుత్వం నుంచి అంతంతమాత్రమే సహకారం లభిస్తోంది. దీంతో కౌలుకు భూములు ఇస్తాం కానీ, సీసీఆర్ కార్డులపై సంతకం చేయబోమని భూ యజమానులు చెబుతున్నారు. వైసీపీ పాలనలో భూముల హక్కులపై రైతుల్లో నమ్మకం సన్నగిల్లింది. దీంతో బీడు భూములుగా అయినా వదులుకుంటాం కానీ, సాగుపత్రాలపై సంతకాలు చేయబోమని మరికొందరు స్పష్టం చేస్తున్నారు. దీంతో కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం వాటిల్లితే తమకు ఎలాంటి పరిహారం అందడం లేదని వాపోతున్నారు. సీసీఆర్ కార్డులు కొందరికే అందజేస్తున్నారని ఆరోపిస్తున్నారు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుభరోసా పథకం కింద ఏటా ఒక్కో రైతుకు రూ.13,500 సాయం అందించేవి. కాగా.. పెరిగిన పెట్టుబడుల నేపథ్యంలో ఈ సాయం ఏమాత్రం సరిపోదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం సాగును ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలంటూ వేడుకుంటున్నారు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించి.. తమకు రుణాలతోపాటు ప్రభుత్వ రాయితీ అందజేయాలని కౌలు రైతులు వేడుకుంటున్నారు.

ఎట్టకేలకు

- వైసీపీ కార్యాలయానికి నోటీసులు



వైసీపీ కార్యాలయం గోడకు నోటీసు

శ్రీకాకుళం అర్బన్, జూన్ 25: శ్రీకాకుళంలోని పెద్దపాడు సమీపంలో వైసీపీ కార్యాలయం అక్రమ నిర్మాణంపై కార్పొరేషన్ ప్లానింగ్ విభాగం అధికారులు ఎట్టకేలకు స్పందించారు. అనుమతులు లేకుండా ఈ భవనాన్ని నిర్మిస్తున్నట్టు తెలిసినా నోటీసులివ్వడంలో జాప్యం చేస్తున్నారంటూ అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో మంగళవారం శ్రీకాకుళం కార్పొరేషన్ ప్లానింగ్ అధికారులు వైసీపీ కార్యాలయానికి నోటీసులు జారీచేశారు. ఏసీపీ వరహాలబాబు, టీపీవో ఉమా ఆదేశాల మేరకు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్, వార్డు సచివాలయ సిబ్బంది.. పెద్దపాడులోని వైసీపీ కార్యాలయం భవనం వద్దకు వెళ్లారు. ఈ భవనానికి అనుమతి లేదంటూ నోటీసులివ్వగా.. వాటిని తీసుకునేందుకు నిర్వాహకులు నిరాకరించారు. దీంతో అధికా రులు ఆ భవనానికి నోటీసులు అంటించారు. అలాగే రిజిస్టర్ పోస్టులో నోటీసులు జారీచేశారు.

● 33 ఏళ్లకు లీజు.. అనుమతి లేకుండానే నిర్మాణాలు

వైసీపీ పాలనలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ.. రోజుకో జీవో విడుదలయ్యేది. ఇదే మాదిరి పెద్దపాడులోని వైసీపీ కార్యాలయ నిర్మాణానికి కూడా 33 ఏళ్ల లీజుతో ప్రభుత్వ భూమిని తీసుకున్నారు. ఈ భూమిలో ఏటువంటి అనుమతి లేకుండానే రెండేళ్లుగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికే 90శాతం మేర పనులు పూర్తయ్యాయి. శ్రీకాకుళం కార్పొరేషన్ నుంచి మంచినీటి ట్యాంకులను సైతం తీసుకెళ్లి.. భవన నిర్మాణ పనులకు వినియోగించారనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమ నిర్మాణం అని తెలిసినా అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఎట్టకేలకు అధికారులు నోటీసులు జారీచేయగా.. భవన నిర్మాణ నిర్వాహకులు ఎలా స్పందిస్తారనేది చర్చనీయాంశమవుతోంది.

● ఈ విషయమై శ్రీకాకుళం కార్పొరేషన్ ఏసీపీ వరహాలబాబు వద్ద ప్రస్తావించగా.. 'పెద్దపాడులో అనధికారికంగా నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయానికి ప్లానింగ్ అనుమతులు లేవు. ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. నోటీసులకు సమాధానం ఇవ్వకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామ'ని తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

మునిసిపల్ నిధులు గోల్‌మాల్

- గణాంకాలపై ఎమ్మెల్యే కూన రవి ఆగ్రహం

ఆమదాలవలస, జూన్ 25: ఆమదాలవలస మునిసిపల్ అధికారులు చూపించిన వివిధ తప్పుడు గణాంకాలపై స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మునిసిపల్ ఉద్యోగులు రికార్డుల్లో చూపిన గణాంకాల్లో వ్యత్యాసం ఉండడంతో గత ప్రభుత్వ హయాంలో నిధులు గోల్‌మాల్ అయ్యాయని ఎమ్మెల్యే కూన రవి ఆరోపించారు. రెండురోజుల్లో శాఖలవారీగా సరైన గణాంకాలు చూపకపోతే సహించేది లేదని హెచ్చరించారు. 2019 నాటికి అప్పటి మునిసిపల్ పాలకవర్గం రూ.2.60కోట్ల ఆదాయం చూపింది. 2019 నుంచి 2024 వరకు 60శాతం పనులు పెంచినా.. ఆదాయం పెరగకపోవడంలో ఆంతర్యమేమిటని ఎమ్మెల్యే రవికుమార్ అధికారులను ప్రశ్నించారు. 2018నాటికి మునిసిపాలిటీలో 46వేల జనాభా ఉండగా.. గణాంకాల్లో గ్రేడింగ్ కోసం తప్పుగా 54వేల జనాభా ఉన్నట్టు చూపడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. అలాగే 23 వార్డుల్లో 10,213 గృహాలు ఉండగా.. 13వేలు గణాంకాల్లో చూపడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మునిసిపాలిటీలో ఉన్నవి 23 వార్డులు కాగా.. చెత్తపన్ను 27 వార్డుల్లో వసూలు చేసినట్టు రికార్డుల్లో ఎందుకు నమోదు చేశారని ప్రశ్నించారు. ఇటువంటి గణాంకాలు చూపితే సహించేది లేదని హెచ్చరించారు. మునిసిపాలిటీలో రహదారులు, డ్రైనేజీలు, పార్కులు, తాగునీరు, వసతులు శ్మశాన వాటికలు, పాఠశాలల పరిస్థితులు, సమస్యలపై పక్కా నివేదికలు అందించాలని ఆదేశించారు. మునిసిపల్ పరిధిలో ఉన్న మార్కెట్, చింతాడ వారపు సంత ఆశీల వేలంపాటను తక్షణమే నిర్వహించాలని సూచించారు. అలాగే వార్డు సచివాలయ ఉద్యోగులకు, వలంటీర్లకు తక్షణమే పేపర్ బిల్లు నిలుపుదల చేయాలని తెలిపారు. కార్యక్ర మంలో మున్సిపల్ కమిషనర్ జి.రవి, ఏఈ అప్పల నాయుడు, టీపీవో హెచ్.సత్యనారాయణ, టీడీపీ రాష్ట్రలీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ పాల్గొన్నారు.

ప్రతీ పార్సిల్ పరిశీలించాలి

- ఎస్‌ఈబీ సూపరింటెండెంట్ తిరుపతిరావు

శ్రీకాకుళం క్రైం, జూన్ 25: ప్రతీ పార్సిల్ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ధ్రువీకరించి రవాణాకు అనుమతినివ్వాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) సూపరింటెండెంట్ సీహెచ్ తిరుపతిరావు తెలిపారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం శ్రీకాకుళంలో ఎస్‌ఈబీ ఆధ్వర్యంలో పార్సిల్స్, ట్రాన్స్‌పోర్టు, ట్రావెల్స్ కార్యాలయ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిషేధిత పదార్థాల రవాణాపై జాగ్రత్తలు వహించాలని తెలిపారు. ప్రతి ట్రాన్స్‌పోర్టు, పార్సిల్స్, ట్రావెల్స్ కార్యాలయాల్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. వినియోగదారుల వద్ద మొబైల్ నెంబర్, డెస్టినేషన్ పాయింట్, తదితర వివరాలు తీసుకోవాలన్నారు. నిషేధిత పదార్థాల జాబితాను కార్యాలయాల్లో ప్రదర్శించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎం.వినీషా, ఇన్‌స్పెక్టర్ ఎంవీ గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఉద్దానం ప్రాంతలో పండే నాణ్యమైన జీడి పిక్కలు

బస్తా రూ.14 వేలు

- అమాంతం పెరిగిన జీడి పిక్కల ధరలు
- పప్పు ధరలు కూడా..
- ఊపందుకుంటున్న కొనుగోళ్లు
- రైతుల్లో ఆనందం

(పలాస/వజ్రపుకొత్తూరు)

ఐదేళ్లుగా నేల చూపులు చూసిన ఉద్దానం జీడి పిక్కల ధరలు ఇప్పుడు పరుగులు పెడుతున్నాయి. గతంలో గిట్టుబాటు లేక విలవిల్లాడిన జీడిరైతులు ప్రస్తుతం పెరుగుతున్న ధరలతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వం వ్యాపారంపై సానుకూల దృక్పథంతో ఉండడంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా జీడిపప్పుకు డిమాండ్ ఏర్పడడంతో పిక్కల ధరలు పెరుగుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఈ ఏడాది దిగుబడి తగ్గడం కూడా మరో కారణమని పేర్కొంటున్నారు. కొద్దిరోజుల కిందట వరకూ బస్తా పిక్కలు (80 కిలోలు) ధర రూ.10వేలు లోపే ఉండేది. ప్రస్తుతం రూ.13,500 నుంచి నుంచి రూ.14 వేల వరకు పలుకుతోంది. పలాస మార్కెట్‌లో జీడిపిక్కలతో పాటు జీడి పప్పు ధరలు కూడా పెరుగుతున్నాయి. నాణ్యమైన జీడి పప్పు కిలో రూ.820 వరకూ పలుకుతోంది. కిలోకు రూ.200 వరకూ ధర పెరగిందని వ్యాపారులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో ధర మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. విదేశీ పిక్కలు కన్నా.. ఉద్దానం ప్రాంత జీడి పిక్కలు నాణ్యతతో పాటు పప్పు దిగుబడి కూడా ఆశాజనకంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో వ్యాపారులు కూడా రైతులను ప్రోత్సహించేలా.. స్థానిక జీడిపిక్కల కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో జీడిపిక్కల కొనుగోళ్ల ప్రారంభమయ్యాయి. వజ్రపుకొత్తూరు మండలం కొండపల్లి, గడివూరు, అనకాపల్లి, ఒంకులూరు, మెట్టూరు, అక్కుపల్లి తదితర గ్రామాల్లో బస్తా ధర రూ.14వేలకు వ్యాపారులు కొనుగోళ్లు చేస్తున్నారు. పల్లిసారథి, వజ్రపుకొత్తూరు, నగరంపల్లి, కిడిసింగి, పూండి, పరసర గ్రామాల్లో బస్తా రూ.13 వేలకు కొనుగోళ్లు చేపట్టారు. రానున్న రోజుల్లో రూ.16వేలకు పెరిగే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వైసీసీ పాలనలో రూ.9 వేలే..

జిల్లాలో ఉద్దానంతో పాటు ఏజెన్సీ ప్రాంతంలో 27వేల హెక్టార్లలో జీడి పంట సాగవుతోంది. గ్రామాల్లో ఏప్రిల్ నెల నుంచి జీడిపిక్కల సీజన్ ప్రారంభమవుతుంది. జీడి పిక్కల మద్దతు ధర కోసం ఏళ్లుగా రైతుల పోరాటం చేస్తున్నా ఫలితం కనిపించలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జీడి పిక్కల బస్తా ధర అధికంగా రూ.9వేలు పలికింది. దీంతో రైతులు ఆందోళనబాట పట్టారు. అప్పటి మంత్రి సీదిరి అప్పలరాజు రైతులకు ఊరట కల్పించేలా ప్రభుత్వం నుంచి బస్తాకు రూ.వెయ్యి ఇస్తామని ప్రకటించారు. కానీ, ఆ మద్దతు ధర నేటికీ రైతుల ఖాతాల్లో జమకాలేదు. దీనిపై పోరాటమే మార్గమని రైతాంగ సాధన కమిటీ ఆధ్వర్యంలో రైతులు గత ప్రభుత్వంపై ఒత్తిళ్లు తీసుకువచ్చారు. అలాగే ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులను కూడా కలిశారు. జీడికి మద్దతు ధర ప్రకటిస్తే టీడీపీకి మద్దతు ఇస్తామని రైతులు ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, జీడి పిక్కల ధరలు పెరుగుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విదేశీ పిక్కలు కట్టడి కావడంతో దేశీయ జీడిపిక్కల ధరలు పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు. దేశీయ పిక్కల మార్కెట్ పూర్తయిన తరువాతే విదేశీ పిక్కలు దిగుమతి చేసుకునే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

టెక్కలిలో వరుస చోరీలు

- వారం వ్యవధిలో నాలుగు..
- భయాందోళనలో ప్రజలు



(టెక్కలి)

టెక్కలి మేజర్‌పంచాయతీలో పలుచోట్ల వరుస దొంగతనాలు.. పోలీసులకు సవాల్ విసురుతున్నాయి. వారం రోజుల వ్యవధిలో జరిగిన నాలుగు చోరీలు.. ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఈ నెల 17న టెక్కలిలో నిత్యం రద్దీగా ఉండే జడ్పీ రోడ్డు కచేరివీధి జంక్షన్‌లోని రాజరాజేశ్వరి జ్యూయలరీ షాప్‌లో పట్టపగలే చోరీ జరిగింది. ఉదయం 11గంటల సమయంలో కారులో ఓ వ్యక్తి వచ్చి.. బంగారం కొనుగోలు చేసినట్టు నటిస్తూ.. మూడు తులాలకుపైగా ఉన్న మూడు బంగారం గొలుసులతో ఉడాయించాడు. దీంతో బాధిత వ్యాపారి వరప్రసాద్ పోలీసులను ఆశ్రయించారు. పట్టణ నడిబొడ్డున పట్టపగలే చోరీ జరగడంతో వ్యాపారులు ఉలిక్కిపడ్డారు.

● శుక్రవారం టెక్కలిలోని కొడాలి జంక్షన్ ఎదురుగా నర్సింగపల్లి సర్పంచ్ రౌతు జయమోహన్ బుల్లెట్ ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు.

● శనివారం వేకువజామున వెంకటేశ్వరకాలనీలో నివాసం ఉంటున్న సీఆర్‌పీఎఫ్ రిటైర్డ్ జవాన్ కురమాన పురుషోత్తం ఇంట్లో తులం బంగారం చోరీ జరిగింది.

● సోమవారం వంశధార కాలనీలో ఓ బ్యాంక్ మేనేజర్ ఇంట్లో ఎవరూలేని సమయంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఐదు తులాల బంగారు ఆభరణాలు, కిలో వెండి వస్తువులు అపహరించారని బ్యాంక్ మేనేజర్ భార్య కోడూరు జయశ్రీ టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● జాతీయరహదారిపై రాత్రిపూట విశ్రాంతి తీసుకునే లారీ డ్రైవర్లు, క్లీనర్లు దగ్గర కూడా పెద్దఎత్తున చోరీ సంఘటనలు జరుగుతున్నాయి. వరుసగా దొంగతనాలు జరుగుతున్నా.. ఏ ఒక్క కేసును కూడా పోలీసులు చేధించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలో అన్ని జంక్షన్లలోనూ సీసీ కెమెరాలు ఉన్నా నిందితులను పట్టుకోవడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. టెక్కలిలో ఓవైపు పోలీస్ సబ్‌డివిజన్, మరోవైపు సర్కిల్ కార్యాలయాలు ఉన్నా వరుస దొంగతనాలు స్థానికుల్లో విస్మయం కలిగిస్తున్నాయి. ఈ విషయమై డీఎస్పీ బాలచంద్రారెడ్డి వద్ద ప్రస్తావించగా.. ఈ దొంగతనాల కేసులు త్వరలో చేదిస్తామన్నారు. పట్టణంలో పోలీసుల నిఘా మరింత పెంచుతామని తెలిపారు. సీఐ అనారోగ్యంతో సెలవుపై ఉండడంతో దర్యాప్తులో జాప్యమైందని వివరించారు.



ఆంజనేయస్వామి ఆలయంలో...

నరసన్నపేట, జూన్ 25: స్థానిక పెద్దపేటలోని ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం తెల్లవారుజామున చోరి జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ముఖానికి మాస్కులు ధరించి.. సీసీ కెమెరాలకు టూత్‌పేస్ట్ పెట్టి ఆలయ తలుపులు పగలుగొట్టారు. గర్భగుడిలో మూలవిరాట్‌కు చెందిన కేజీన్నర వెండి ఆభరణాలు, హుండీలోని సుమారు రూ.10వేల వరకు నగదు తస్కరించారు. దీనిపై ఆలయ అర్చకుడు శివశర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని క్లూస్‌టీమ్ పరిశీలించి వేలిముద్రలు సేకరించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు.



ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

నీట్ ఫలితాలపై విచారణ చేయాలి

- ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ డిమాండ్

అరసవల్లి/ గుజరాతీపేట, జూన్ 25: నీట్ పరీక్షా ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్), అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. శ్రీకాకుళంలోని అరసవల్లి జంక్షన్ వద్ద మంగళవారం ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 'నీట్ పరీక్షా ఫలితాల్లో దేశవ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 720/720 మార్కులు వచ్చాయి. అందులో హర్యానాలోని ఒకే సెంటర్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ఉన్నారు. బీహార్‌కు చెందిన ముఠా ఒక్కో విద్యార్థి నుంచి రూ.30లక్షలు వసూలు చేసి దొరికినా సరే.. వారిని ఇంతవరకు అరెస్టు చేయకపోవడం దుర్మార్గం. తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాల'ని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనల వలన వేలాదిమంది ప్రతిభ గల విద్యార్థులు మెడికల్ విద్యకు దూరమవుతారని వాపోయారు. మళ్లీ నీట్ పరీక్ష నిర్వహించాలని కోరారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు చేస్తున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్, చందు, సాయి, ప్రదీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

దిక్సూచి DIKSUCHI

విలక్షణ కోర్సు ప్యాకేజింగ్ టెక్నాలజీ

ఒక వస్తువుని ఉత్పత్తి చేయడం ఎంత ముఖ్యమో, దానిని అంతే భద్రంగా వినియోగదారుడికి చేర్చడం కూడా ప్రధానమే. ఈ ప్రక్రియలో కూడా ఎంతో మంది పాల్గొంటారు. అందులో ప్యాకేజింగ్ ముఖ్యమైనది. వస్తువు స్వరూప స్వభావాలను అనుసరించి అవసరమైన విధంగా అట్టపెట్టె లేదంటే మరొకదానిలో పెట్టాలి. భద్రంగా దానిని వినియోగదారుడి ఇంటికి లేదంటే తను సందర్శించే షాపు వద్దకు చేర్చాలి. ఈ ప్రాసెస్ మొత్తం ప్యాకేజింగ్ కిందకు వస్తుంది. ఈ రంగంలో ప్రాథమిక కోర్సు 'డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ'. హైదరాబాద్ రామంతపూర్‌లో ఉన్న జెఎన్ గవర్నమెంట్ పాలిటెక్నిక్‌లో ఈ కోర్సు ఉంది.



గ్రామాలు లేదంటే సమీప వ్యవసాయ క్షేత్రాల నుంచి పట్టణాలకు వెదురు బుట్టలు, తాటాకు తట్టల్లో కూరగాయలు, పండ్లు వస్తుంటాయి. జనుము సంచీల్లో బియ్యం రవాణా అవుతుంది. అయితే సాంకేతిక పురోభివృద్ధితో ప్యాకేజింగ్ అక్కడితో ఆగలేదు. ఒక హోటల్ నుంచి వండిన ఆహార పదార్థం, ఒక ఫార్మా కంపెనీ నుంచి పలు రకాల మందులు డిస్ట్రిబ్యూటర్‌కు చేరుకోవడం మొదలుకుని రకరకాల వస్తువులు ఆన్‌లైన్‌లో పొందే అవకాశం నేడుంది. ఆ క్రమంలో వస్తువు చెడిపోకుండా వినియోగదారుడికి చేర్చే ప్రక్రియకు సాంకేతికతను జోడించారు. దానిని పటిష్టంగా అమలు చేసేందుకు ప్యాకేజింగ్ ప్రధాన ఊతంగా మారింది. దేశీయంగా మధ్యతరగతి ఎదుగుదల, వ్యవస్థీకృత రీటైల్ రంగ విస్తరణ, ఎగుమతుల్లో పెరుగుదల ఫలితంగా ఈ కామర్స్ బలపడింది. అది సహజంగానే ప్యాకేజింగ్ పెరుగుదలకు దోహదపడింది. కొవిడ్ సంక్షోభం ఊహించని పెనుముప్పు. అయితే, ప్యాకేజింగ్ పరిశ్రమకు మాత్రం మంచి ఊపునిచ్చింది. ఒక పక్క ఔషధ పరిశ్రమ, మరోపక్క ఇంటికే నేరుగా డెలివరీలతో ప్యాకేజింగ్ పరిశ్రమ అవసరం బాగా పెరిగింది. ఆహారం నుంచి అవసరమైన వస్తువు వరకు ఏదైనా సరే, తప్పనిసరి పరిస్థితుల్లో ఇంటికే తెప్పించుకోవాల్సిన అగత్యం ఏర్పడింది.

కోర్సుగా: హైదరాబాద్‌లోని రామాంతపూర్‌లో ఉన్న జెఎన్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ మాత్రమే ఈ కోర్సును ఆఫర్ చేస్తోంది. ఈ కోర్సులో 60 సీట్లు ఉన్నాయి. 1996లో దీన్ని ఇక్కడ ఆరంభించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ముఖ్యంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఈ ఒక్క పాలిటెక్నిక్ మాత్రమే ప్యాకేజింగ్ టెక్నాలజీలో డిప్లొమాను అందిస్తోంది. గ్రామీణ, పేద విద్యార్థులకు ఈ కోర్సు నిజంగా వరమని చెప్పాలి. అత్యంత ప్రతిభావంతులైన ఫ్యాకల్టీ ఈ కోర్సును తీర్చిదిద్దడం నుంచి తమ విద్యార్థులకు ప్రాక్టికల్ ఎక్స్‌పీరియెన్స్ కల్పించేందుకు తద్వారా వారు ఉద్యోగాల్లో స్థిరపడేందుకు ఎంతో కృషి చేస్తున్నారు. కోర్సులో భాగంగా ప్యాకేజింగ్ మెటీరియల్ బేసిక్స్, మెథడాలజీ, డిజైన్, అప్లికేషన్ వంటి విషయాలన్నీ బోధిస్తారు. చివరి సెమిస్టర్‌లో సంబంధిత కంపెనీకి పంపి ప్రాక్టికల్‌గా అవగాహన కల్పిస్తారు.

ఉన్నత చదువులు

- ఈసెట్‌లో ర్యాంక్ సాధించి లేటరల్ ఎంట్రీ కింద బీటెక్‌లో చేరవచ్చు. మెకానికల్, ఏరోనాటికల్, ప్రొడక్షన్ ఇంజనీరింగ్ సీఎస్ఇ, ఐటీ బ్రాంచీల్లో చేరవచ్చు.
- హరియాణా రాష్ట్రం హిస్సార్‌లోని గురు జంబేశ్వర్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అలాగే హర్యానా సెంట్రల్ యూనివర్సిటీ ప్రింటింగ్ అండ్ ప్యాకేజింగ్ టెక్నాలజీలో బీటెక్ కోర్సును అందిస్తున్నాయి.
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ సహకారంతో హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ ప్యాకేజింగ్‌లో ఎమ్మెస్సీ, ఐఐటీ రూర్కీ ప్యాకేజింగ్ టెక్నాలజీలో ఎంటెక్ అందిస్తున్నాయి.
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ నేరుగా ప్యాకేజింగ్‌లో సర్టిఫికెట్, పీజీ డిప్లొమా ఆఫర్ చేస్తోంది.

ఉపాధి: ప్రొడక్ట్ డెలివరీ(అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థలు), ఫుడ్ డెలివరీ(స్విగ్గీ, జొమాటో వంటివి), ఫార్మా ఇండస్ట్రీ సహా ప్యాకేజింగ్ అవసరమైన ప్రతి సంస్థలో వీరికి ఉపాధి అవకాశాలు ఉంటాయి. ఎలక్ట్రికల్ - ఎలక్ట్రానిక్ గాడ్జెట్ల నుంచి వినియోగదారుడి చెంతకు చేరాల్సిన ప్రతి ప్రొడక్ట్‌కు ప్యాకేజింగ్ అవసరమే. అందుకే ఈ డిప్లొమా చేసిన వారికి నిరుద్యోగం అన్న ప్రసక్తే ఉండదు. నిజానికి డిమాండ్‌కు తగ్గ సరఫరాలేదు. ప్రాక్టికల్ ఎక్స్‌పీరియెన్స్ కోసం ఈ ఏడాది 16 మందిని తీసుకున్న రెడ్డి ల్యాబ్స్ ఒకొక్కరికి స్టయిపెండ్‌గా రూ.15,000 చెల్లిస్తోందని ప్యాకేజింగ్ టెక్నాలజీ హెడ్ డాక్టర్ వై.వెంకటరెడ్డి తెలిపారు. తదుపరి మరో ఆరు నెలలు కూడా అదే స్టయిపెండ్‌కు పనిచేస్తే రెగ్యులర్ స్కేల్ ఇస్తామని హామీ ఇచ్చారని అన్నారు. అంతేకాకుండా అరబిందో సహా పలు కంపెనీలు కూడా తమ విద్యార్థులను ఈ ఏడాది తీసుకున్నాయని తెలిపారు. చివరకు కోర్సు పూర్తి చేయలేని విద్యార్థులను సైతం కంపెనీలు తీసుకునే పరిస్థితి నెలకొందని ఆయన వివరించారు.

SCHOLARSHIP ALERT

Kotak Life Insurance Scholarship Program

Description: An initiative by Kotak Life Insurance Company Ltd. to provide financial assistance to students from Tamil Nadu and Maharashtra to help them pursue their undergraduate studies in the commerce stream.

Eligibility:

- Open to students who are residents of Tamil Nadu and Maharashtra.
- Applicants must be enrolled in the first year of a B.Com. program at any of the eight specified colleges in Tamil Nadu and Maharashtra. The list of colleges is given below:
- A. Veeriya Memorial Sri Pushpam College (Thanjavur, Tamil Nadu)
- Nadar Mahajana Sangam S. Vellaichamy Nadar College (Madurai, Tamil Nadu)
- Edayathangudy G.S. Pillay Arts and Science College (Nagapattinam, Tamil Nadu)
- Jai Hind Sindhu Education Trust's Manghanmal Udharam College of Commerce (Pune, Maharashtra)
- Gokhale Education Society's B.Y.K. (Sinnar) College of Commerce (Nashik, Maharashtra)
- LRD and SRP College for Women (Nagpur, Maharashtra)
- Vysya Arts and Science College (Salem, Tamil Nadu)
- Dharmapuram Adhinam Arts Col lege (Mayiladuthurai, Tamil Nadu)
- Applicants must have scored 65% marks or more in Classes 10 and 12.
- Applicants must have passed Class 12 in the year 2023-24.
- The applicant's annual family inco me must be INR 3,60,000 or less.

Prizes & Rewards: Up to INR 30,000 per year

Last Date: 31-07-2024 *Application mode:* Online only

Short Url: www.b4s.in/aj/KLISP2

HOPE Engineering Scholarship by Schaeffler India

Description: Schaeffler India invites applications from first-year engineering female students (preference will be given to students with physical disabilities) to provide them with financial support for their engineering studies.

Eligibility: The scholarship is open to female students and preference will be given to students with physical disabilities. The applicants must have scored more than 60% marks in Class 12 (science) in the academic year 2023-24. They must be enrolled in the first year of an engineering program at any recognized college in India. The annual family income of the applicants should be less than INR 5 lakh.

Prizes & Rewards: Scholarship of INR 50,000 *Last Date:* 30-07-2024

Application mode: Online only *Short Url:* www.b4s.in/aj/SIHE15

Tata Capital Pankh Scholarship Program

Description: An initiative of Tata Capital Limited aimed at providing financial support to students belonging to economically weaker sections of society to help them fulfill their academic dreams.

Eligibility: Indian students who are currently studying in Classes 11, 12 general graduation (B.Com., B.Sc., B.A., etc.), diploma and ITI courses at recognised institutions are eligible. Applicants must have scored at least 60% marks in the preceding class. The annual family income of the applicants from all sources must be less than or equal to INR 2.5 lakh.

Prizes & Rewards: Up to an amount ranging from INR 10,000 to INR 12,000 or 80% of course fees (whichever is less) *Last Date:* 15-09-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/TCPS27

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/FsGGu7Qలో చదవండి.

జేఎన్‌టీయూకేలో ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్

కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)- ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్(ఐసీపీ)లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్)తో కలసి ఆరేళ్ల ప్రోగ్రామ్‌ను, యూఎస్ఏలోని యూనివర్సిటీ ఆఫ్ నార్తరన్ అయోవా(యూఎన్ఐ)తో కలసి నాలుగేళ్ల ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్, కౌన్సెలింగ్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.



జేఎన్‌టీయూకే-బీటీహెచ్ ప్రోగ్రామ్: ఈ ప్రోగ్రామ్‌లో సీఎస్ఈ, సీఎస్ఈ(ఏఐ&ఎంఎల్), ఈసీఈ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 20 సీట్లు చొప్పున మొత్తం 60 సీట్లు ఉన్నాయి. వీటిలో సగం సీట్లను ఐఐటీ జేఈఈ మెయిన్ అభ్యర్థులకు మిగిలిన సగం సీట్లను టీజీ/ఏపీ ఈఏపీసెట్ అభ్యర్థులకు నిర్దేశించారు.

- ప్రోగ్రామ్ మొదటి మూడేళ్లు కాకినాడ జేఎన్‌టీయూలో, చివరి మూడేళ్లు బీటీహెచ్-స్వీడన్‌లో చదవాల్సి ఉంటుంది. నాలుగో ఏడాది కోర్సును బీటీహెచ్‌లో పూర్తిచేశాక ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. వీరికి కాకినాడ జేఎన్‌టీయూ బీటెక్ డిగ్రీని, బీటీహెచ్ బీఎస్ డిగ్రీని ప్రదానం చేస్తాయి. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ మొత్తం పూర్తిచేసినవారికి బీటీహెచ్ నుంచి ఎంఎస్ డిగ్రీ లభిస్తుంది.

ఎంఎస్ స్పెషలైజేషన్‌లు: కంప్యూటర్ సైన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, మెషిన్ లెర్నింగ్-సెన్సర్స్-సిస్టమ్స్.

జేఎన్‌టీయూకే-యూఎన్ఐ ప్రోగ్రామ్: ఈ ప్రోగ్రామ్‌లో ఈఈఈ స్పెషలైజేషన్ ఉంది. మొదటి మూడేళ్లు కాకినాడ జేఎన్‌టీయూలో, చివరి ఏడాది యూఎన్ఐ-యూఎస్ఏలో చదవాలి. వీరికి జేఎన్‌టీయూకే నుంచి బీటెక్ డిగ్రీ, యూఎన్ఐ నుంచి బీఎస్ డిగ్రీ లభిస్తుంది. ఆసక్తిగల అభ్యర్థులు యూఎన్ఐలో కోర్సును కొనసాగిస్తూ మాస్టర్స్ ప్రోగ్రామ్‌లో చేరే వీలుంది.

అర్హత వివరాలు: తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ నుంచి ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 70 శాతం మార్కులు తప్పనిసరి. సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థులందరికీ జేఈఈ మెయిన్ 2024/ఏపీ ఈఏపీసెట్ 2024/టీజీ ఈఏపీసెట్ 2024 అర్హత తప్పనిసరి.

- బీటీహెచ్ నిబంధనల ప్రకారం ఇంటర్ ఆంగ్ల మాధ్యమంలో చదవని వారు టోఫెల్/ఐఈఎల్‌టీఎస్ అర్హత పొందాల్సి ఉంటుంది. టోఫెల్‌లో 575/90 స్కోర్; ఐఈఎల్‌టీఎస్‌లో ప్రతి సెక్షన్‌లో కనీసం 5.5 స్కోర్‌తోపాటు మొత్తమ్మీద కనీసం 6.5 స్కోర్ రావాలి.
- యూఎన్ఐ నిబంధనల ప్రకారం ఐఈఎల్‌టీఎస్‌లో 6.0 లేదా టోఫెల్‌లో 79 స్కోర్ ఉండాలి. మాస్టర్స్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే బీఎస్ డిగ్రీలో కనీసం 3.0 క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ ఉండాలి. మూడు రికమండేషన్ లెటర్లు, పర్సనల్ స్టేట్‌మెంట్ సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **చిరునామా:** డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూకే, కాకినాడ - 533003
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

నవ్య చిత్రజ్యోతి

అధర్మాన్ని అణిచేయగా...



భారీ అంచనాల మధ్య 'కల్కి 2898 ఏడీ' చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాపై భారీ అంచానాలు ఉన్నాయి. ప్రమోషనల్ కంటెంట్‌తో చిత్ర బృందం ఎప్పటికప్పుడు ఆ అంచనాలను రెట్టింపు చేస్తోంది. తాజాగా 'థీమ్ ఆఫ్ కల్కి' లిరికల్ వీడియోను మంగళవారం విడుదల చేశారు. 'అధర్మాన్ని అణిచేయగా' అంటూ చంద్రబోస్ రాసిన ఈ పాటను కాలభైరవ పాడారు. సంతోష్ నారాయణ్ స్వరాలు సమకూర్చారు. పాత్రల తాలుకు నేపథ్యం, వాటి సంఘర్షణ.. ఇవన్నీ పాటలో చూపించారు. ఇటీవల ఈ పాటను మధురలో ఆవిష్కరించారు. ప్రముఖ నటి, నర్తకి శోభనా చంద్రకుమార్ ఈ పాట కోసం గజ్జె కట్టారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, ప్రభాస్, దీపిక, దిశా పటాని కీలక పాత్రలు పోషించారు.

ఎలా ఉన్నావ్ శ్రీలీల

● బుగ్గ గిల్లి.. ఆప్యాయంగా పలకరించిన సంగీత దర్శకుడు తమన్



శ్రీవారి దర్శనార్థం వచ్చిన హీరోయిన్ శ్రీలీలను చూసిన సినీ సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ ఆప్యాయంగా పలకరించారు. శ్రీలీల మంగళవారం స్వామిని దర్శించుకుని ఆలయం వెలుపలకు వస్తున్న క్రమంలో దర్శనానికి వెళుతున్న తమన్ మహద్వారం వద్ద ఎదురుపడ్డారు. దీంతో తమన్ ఆగి శ్రీలీలను బుగ్గ గిల్లి.. ఎలా ఉన్నావ్ అంటూ పలకరించారు. అనంతరం శ్రీలీల తన కుటుంబ సభ్యులను తమన్‌కు పరిచయం చేసింది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

తిరుమల, (ఆంధ్రజ్యోతి)

నేతాజీ మార్గంలో నేను



'ఇది రెండో స్వతంత్ర పోరాటం... గాంధీజీ మార్గంలో మీరు, నేతాజీ మార్గంలో నేను' అంటున్నారు కమల్‌హాసన్. ఆయన కథానాయకుడిగా నటించిన 'ఇండియన్ 2' (తెలుగులో 'భారతీయుడు 2') చిత్రంలోనిదీ డైలాగ్. మంగళవారం చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. దేశంలో అవినీతిపరులను ఏరి పారేసేందుకు ఈ సారి సేనాపతి పాత్రలో కమల్‌హాసన్ ఎలాంటి సాహసాలు చేయబోతున్నాడో అనే ఆసక్తిని కలిగించేలా ట్రైలర్‌ను రూపొందించారు. కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్‌సింగ్, సిద్ధార్థ్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి శంకర్ దర్శకుడు. 1996లో వచ్చిన 'భారతీయుడు' చిత్రానికి ఇది కొనసాగింపు. జూలై 12న 'భారతీయుడు 2' ప్రేక్షకుల ముందుకు రానుంది. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ బ్యానర్స్‌పై సుభాస్కరన్ నిర్మించారు.



పవన్‌తో అల్లు అరవింద్ భేటీ

ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఎన్నికల్లో కూటమి అద్భుత విజయం సాధించిన నేపథ్యంలో పవన్ కల్యాణ్‌కు అభినందనలు తెలిపారు. ఏపీలో సినీ నిర్మాణ రంగం, ప్రదర్శన రంగం ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను గురించి ఈ సమావేశంలో వారి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది.

శ్రీనివాసుని సన్నిధిలో సుశీల



సీనియర్ నేపథ్య గాయని పి. సుశీల మంగళవారం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. సోమవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆమె శ్రీవారికి తలనీలాలు సమర్పించి మంగళవారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆలయం ముందు సుశీలను చూసిన పలువురు అభిమానులు దగ్గరకు వెళ్లి పలకరించారు. కొందరు ఆమెతో సెల్ఫీలు తీసుకున్నారు. ఎన్నాళ్ల నుంచో స్వామి వారికి తలనీలాలు సమర్పించే మొక్కు ఉందనీ, ఇన్నాళ్లకు అది తీరిందని సుశీల చెప్పారు.

తిరుమల, (ఆంధ్రజ్యోతి)

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/adGg9cX లో చదవండి.

ఆక్రమిత ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటాం

● మండల సమావేశంలో ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం జూన్ 25: గడచిన ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను తిరిగి వెనక్కు తీసుకుంటామని, ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు (ఎంజీఆర్) అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ దొర సావిత్రమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ బాధ్యతగా సేవలు అందించాలని అధికారులకు సూచించారు. ప్రొటోకాల్ తప్పనిసరిగా పాటించాలని, అధికార, ప్రతిపక్ష హోదాలకు పార్టీలకు అతీతంగా ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించా లన్నారు. బడ్డుమర్రి సర్పంచ్ నీలకంఠం మాట్లాడుతూ.. కోఇంగిలో సుమారు 18 ఎకరాల ప్రభుత్వ భూమిని వైసీపీ నాయకులు ఆక్రమించారని సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ.. వీటితో పాటు పాతపట్నంలో జగనన్న కాలనీలు, పాఠశాలల భూములు ఆక్రమణలకు గురయ్యాని తన దృష్టికి వచ్చాయన్నారు. వీటిపై సమగ్ర సమాచారం అందించాలని తహసీల్దార్ ప్రసాదరావును ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాల స్థలంపై కోర్టులో పెండింగ్‌లపై సమాచారం ఇవ్వాలని ఎంఈవో బి.శ్రీధర్‌ను ఆదేశించారు. దీనిపై అవసరమైతే ఉన్నతస్థాయి కోర్టుకు వెళ్లి ప్రభుత్వ భూమిని పరిరక్షిద్దామన్నారు. చాకిపల్లిలో ఎయిడెడ్ స్కూల్ స్థానంలో ప్రభుత్వం పాఠశాలను మంజూరు చేసిందని, ఉపాధ్యాయులను నియమించలేదని పలువురు ప్రజాప్రతినిధులు తెలిపారు. సత్వరం తగు చర్యలు తీసుకోవాలని ఎంఈవోను ఎమ్మెల్యే ఆదేశించారు. మండలంలో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉన్నా తక్షణం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాతపట్నంలోని 50 పడకల సామాజిక ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యేగా తనకు వచ్చే జీతాన్ని ప్రజా సంక్షేమం కోసం వినియోగిస్తానని ప్రకటించారు. నెలలో ప్రతీ 1, 3 బుధవారాల్లో ఎమ్మెల్యే ప్రజా దర్బార్‌ని నిర్వహిస్తామని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాగా భైదలాపురం పీహెచ్‌సీ వైద్యురాలు పి.సత్యవాణి దీర్ఘకాలంగా విధులకు హాజరుకావడం లేదని ఆర్‌ఎల్‌పురం నాయకుడు అంపోలు మధు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఎమ్మెల్యే.. వైద్యాధికారి సదాశివను ప్రశ్నించారు. డిసెంబరు 22న విధుల్లో చేరిన సత్యవాణి ఇప్పటి వరకు ఏడు రోజులు మాత్రం విధులకు వచ్చారని ఆయన పేర్కొనగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈమెపై చర్యలకు వైద్యశాఖ ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తానని స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, జడ్పీటీసీ లింగాల ఉషారాణి, ఎంపీడీవో కె.రామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాడి పరిశ్రమ ద్వారా ఆదాయానికి కృషి: శిరీష

పలాస, జూన్ 25: పాడి పరిశ్రమ ద్వారా ప్రతి రైతుకు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో పలాస నియోజకవర్గ పశుసంవర్ధక, వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేస్తామన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి అధికారులు సహకరించాలని, రైతులకు అవసరమైతే దాతల ద్వారా ఆర్థిక సాయాన్ని అందించడం జరుగు తుందన్నారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి, పీరుకట్ల విఠల్‌రావు, జీకే నాయుడు, వ్యవసాయశాఖ జేడీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న గౌతు శిరీష

జీవో నెం.117ను రద్దుచేయాలి

నరసన్నపేట: జీవో నెం.117 వల్ల ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యమై విద్యా వ్యవస్థ ఛిన్నా భిన్న మైందని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం బడాం, తామరాపల్లి, నడగాం తదితర పాఠశాలల్లో సంఘ సభ్యత నమోదు కార్యక్రమం చేపట్టారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఈ జీవోను రద్దు చేసి పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల ప్రతినిధులు బి.కేశవరావు, ఎం.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ● **పోలాకి:** విద్యావ్యవస్థను నాశనం చేసేలా వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన జీవో 117 ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర సహా ధ్యక్షులు చింతాడ దిలీప్ కుమార్, వెంకట రమణ డిమాండ్ చేశారు. మంగళవారం బొద్దాం, దండులక్ష్మీపురంలో ఉపాధ్యాయులతో మాట్లాడారు. అమ్మకు వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థు లకు అమలు చేస్తే పాఠశాలలు బలోపేతమవుతాయన్నారు.

సేవాసంస్థ కార్యవర్గం ఎన్నిక

హరిపురం: అంబుగాం గ్రామంలో మంగళవారం శ్రీపవనపుత్ర సేవాసంస్థ నూతన కార్య వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆశపన్న బాలరాజు, ఉపాధ్యక్షుడిగా పీరుకట్ల చలపతి, కార్య దర్శిగా రాపాక కేశవరావు, కోశాధికారిగా ఇప్పిలి ప్రదీప్, సంయుక్త కార్యదర్శిగా తిరుపతిగౌడలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రక్తదానం, ఆపదలో ఉన్న వారికి ఆదుకోవడం, బాధి తులకు నిత్యా వసర సరుకుల పంపిణీ తదితర సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వీటిని మరింత విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వ కార్యవర్గంతోపాటు పలువురు యువకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను వినియోగిస్తే నష్టం

టెక్కలి: యువత మాదక ద్రవ్యాలను వినియోగిస్తే తీవ్రంగా నష్టపోతారని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ జీఎస్ రాజశేఖర నాయుడు, టాస్క్‌ఫోర్స్ సీఐ రామచంద్రకుమార్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రైవేటు జూనియర్ కళాశాల, ఐటీఐల్లో విద్యార్థులకు అవ గాహన కలిగించారు. మాదకద్రవ్యాల వల్ల కలుగు ప్రమాదాలు, కేసులు నమోదైతే విద్యార్థుల భవిష్యత్ అంశాలను వివరించారు.

వ్యసనాలకు బానిస కావద్దు

నరసన్నపేట: యువత వ్యసనాలకు బానిస కావద్దని, బంగారు భవిష్యత్ బాటలు వేసుకోవాలని ఎస్ఐ అశోక్‌బాబు అన్నారు. మంగళవారం స్థానికంగా ప్రైవేటు విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాల జోలికి పోవద్దని, దీంతో భవిష్యత్‌ను కోల్పోతారన్నారు. సన్మార్గం వైపు అడుగులు వేయాలని సూచించారు. పట్టుదలతో చదివితే సాధించలేనదేదీ లేదన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ దాలినాయుడు, చిరంజీవరావు, ప్రిన్సిపాల్ చింతు కృష్ణారావు, ఏవో అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వం రైతుల పక్షపాతి

వజ్రపుకొత్తూరు: టీడీపీ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు అన్నారు. మంగళవారం గరుడుభద్ర, రాజాం పంచాయతీల్లో విత్తనాల పంపిణీ చేప ట్టారు. వ్యవసాయాధికారులతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. రైతులను అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు పోతనపల్లి సాంబమూర్తి, కోనారి గణపతి, కోనేరు ఆదినారాయణ , శాంతారావు రెళ్ల దానయ్య , చెల్లూరు రాజశేఖర్ ఉన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

వజ్రపుకొత్తూరు: పూండి-గోవిందపురం పంచాయతీ పరిధి సీతంపేట తదితర గ్రామాల్లో ఉపాధి హామీ పనులను మండలపరిషత్ మాజీ విప్ కర్ని రమణ, ఆసుపత్రి మాజీ ఛైర్మన్ పుచ్చ ఈశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. కొత్తచెరువు, ట్యాంకు చెరువుల్లో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌సర్పంచ్ గుంట సత్యం, గొర్లెల గణేష్, పాలవలస వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఇంటింటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవాలి

కొత్తూరు: ఇంటింటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవాలని వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వర ప్రసాదరావు కోరారు. కొత్తూరులో హెల్త్, అంగన్‌వాడీ, పంచాయతీ, ఇంజనీరింగ్‌శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖల అధికారులతో సదస్సు నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో త్రివిక్రమరావు, ఈవోపీ ఆర్డీ కృష్ణారావు, ఐసీడీఎస్ పీవో విమలాకుమారి పాల్గొన్నారు.

ఘనంగా వరసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం

నందిగాం: నందిగాం గణేష్ కాలనీలో కొలువై ఉన్న వరసిద్ధి వినాయక ఆలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. నిర్వాహకుడు, ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి, యువత ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. గ్రామ పురోహితులు రేజేటి బోసుబాబు, ఎం.రమేష్‌శర్మ పర్యవేక్షణలో రక్షాబంధన్, విఘ్నేశ్వరపూజ, హోమాలు నిర్వహించారు.

తాగునీటికి ఇబ్బంది రానివ్వద్దు

మెళియాపుట్టి: గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జి.భాస్కరరావు అన్నారు. మంగళవారం మెళియాపుట్టిలోని తాగునీటి పథకంతో మురుగు కాలువ లను పరిశీలించారు. ప్రతి వీధికి తాగునీరందించాలన్నారు. వర్షాకాలు కావడంతో కాలువల్లోని సిల్ట్ తొలగించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి చింతల అప్పారావు, టీడీపీ నాయకులు వాసు, మాడుగుళ్ల, బానోజీరావు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై ఫిర్యాదు

సంతబొమ్మాళి: పాతమేఘవరంలో ఉన్న రొయ్యల ఉత్పత్తి పరిశ్రమ యాజమాన్యం ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తోందని టీడీపీ మండల మత్స్యకార నాయకులు సూరాడ ధనరాజ్, వారాధి చంటి తహసీల్దార్ సత్యనారాయణకు మంగళవారం ఫిర్యాదు చేశా రు. వెంటనే ఈ భూములను సర్వే చేసి ప్రభుత్వ భూమిలో అక్రమంగా కడుతున్న ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరారు. అటవీ శాఖ అనుమతి లేకుండా పైప్‌లైన్ వేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

250 పశువులకు వ్యాక్సిన్లు

సంతబొమ్మాళి: బోరుభద్ర పంచాయతీ గొదలాంలో 250 పశువులకు గొంతు, జబ్బవాపు వ్యాధి టీకాలను మంగళవారం వేశారు. గ్రామంలో ప్రత్యేక పశువైద్య శిబిరం నిర్వహించి పశు వైద్యాధికారి అప్పలసూరి ఆధ్వర్యంలో వ్యాక్సిన్లు వేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం తొలకరి జల్లులు పడుతున్నాయని ఈ సమయంలో పశువులకు అంటువ్యాధులు ప్రబలకుండా వ్యాక్సిన్లు వేయించాలని రైతులను కోరారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

సంతబొమ్మాళి: మరువాడ ఎంపీయూపీ పాఠశాలకు ఆ గ్రామ యూత్ అసోసియేషన్ సభ్యులు రూ.45 వేలు విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్ ఇతర పరికరాలను అందించారు. జిల్లా తెలుగుయువత కార్యదర్శి, విద్యా కమిటీ ఛైర్మన్ సూరాడ దాసురాజు, హెచ్ఎం రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఓంకార్ మాస్టార్ మృతి


ఓంకార్ (ఫైల్)

పలాసరూరల్: మాకన్నపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ఓంకార్ (55) అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతి చెందారు. ఈయన ఉద్దానం ప్రాంతంలో పలు సంఘాలకు, విద్యా వేదికలకు సలహాదారుడిగా ఉన్నారు. యూటీఎఫ్ సభ్యుడిగా ఉంటూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పాటు పడ్డారు. అలాగే కళాకారుడిగా డప్పు కళాకారుడిగా మంచి పేరు పొందారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి, ఉద్దానం విద్యావేదిక అభివృద్ధికి పాటుపడ్డారు. ఓంకార్ మాస్టారు మృతి చెందారన్న విషయం తెలుసుకుని పలువురు సంతాపం వ్యక్తం చేశారు. సంతాపం తెలిపిన వారిలో యూటీఎఫ్ సంఘ సభ్యులు ఎల్.వెంకటాచలం, గ్రీన్‌ఆర్మీ అధ్యక్షుడు బి.గోపాల్, ఉపాధ్యాయ సంఘాల నేతలు, యూవీవీ ప్రతినిధులు, కళాకారులు, విప్లవ సంఘాల సభ్యులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పోలాకి: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున సీజనల్‌గా వచ్చే వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది అప్ర మత్తంగా ఉండాలని జిల్లా మలేరియా రీసెర్చ్ విభాగాధిపతి నల్లి రవికుమార్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉషశ్రీ అధ్యక్షతన మండలస్థాయి ఉద్యోగుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరిచి ఆరోగ్యకర వాతావరణం కల్పించేలా పంచాయతీ సిబ్బంది సహకరించాలన్నారు. ఎంపీడీవో ఉషశ్రీ మాట్లాడుతూ.. డెంగ్యూ, మలేరియా, డయేరియా వంటి వ్యాధులు సోకకుండా వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. సచివాలయ, పంచాయతీ, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనాథ్, పంచాయతీ అధికారి వి.పద్మావతి, ఎస్సార్పీ దంత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌కు అభినందన



హరిపురం: రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన్ రాష్ట్ర కార్యదర్శి మద్దిబట్ల శాంతారావు శర్మ తన సంఘ సభ్యులతో కలిసి మంగళవారం అభినందించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు.

రైతుబజార్ పరిశీలన

టెక్కలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా నిర్మాణమై అర్ధంతరంగా ఆగిపోయిన రైతుబజార్ ప్రాంతాన్ని మార్కెటింగ్ శాఖ కార్యదర్శి కాళేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. టీడీపీ హయాంలో రూ.120 కోట్లతో నిర్మించారు. అయితే ఆ తరువాత వైసీపీ ప్రభుత్వంలో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలతో అధికారులు క్షేత్రస్థాయిలో భవనాల పరిస్థితిని పరిశీలించారు. రైతుబజార్ పరిస్థితి, పనులు ఎందుకు నిలిచిపోయాయన్న అంశాలను పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు బగాది శేషగిరిరావు, కోళ్ల లవకుమార్ పాల్గొన్నారు.

నేడు ఎంజీఆర్ విజయోత్సవ సభ

పాతపట్నం: ఎమ్మెల్యే మామిడి గోవిందరావు విజయోత్సవ కార్యక్రమం స్థానిక కేఎస్ఎం ప్లాజాలో బుధవారం నిర్వహిస్తున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు సైలాడ సతీష్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్న విజయోత్సవంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



గార: మాట్లాడుతున్న శంకర్

శివారు ఆయకట్టుకు సాగునీరే లక్ష్యం

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం అర్బన్: ఖరీఫ్‌లో చివరి ఆయకట్టుకు నీరందించడమే లక్ష్యమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వంశధార కుడి ప్రధాన కాలువకు మరమ్మతులు చేయకపోతే ఆమరణ దీక్ష చేపడతానని హెచ్చరించడంతో పనులు ప్రారంభించారని చెప్పారు. నియోజకవర్గానికి అదనంగా 350 క్వింటాల వరి విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పాలకొండ రోడ్డు నుంచి ఆమదాలవలస ప్రధాన రహదారి మరమ్మతులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. నగరపాలక సంస్థ ఎన్నికల విషయంపై ఆ శాఖ మంత్రి నారాయణరావు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అసంతృప్తిగా నిలిచిపోయిన స్టేడియం పనులు చేపడతామన్నారు. విలీన పంచాయతీల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామన్నారు. మహిళా కళాశాలలో ఏడు తరగతులు చెట్ల కింద జరగడం దారుణమని, విద్యకు వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యత ఇదేనా అని ప్రశ్నించారు. 40 మంది లెక్చరర్లకు గాను 20 మంది మాత్రమే ఉంటే ఉత్తీర్ణత శాతం ఏలా పెరుగుతుందన్నారు. ప్రజలు తనకు ఎప్పుడైన సమస్యలు తెలియజేయవచ్చని, తన కార్యాలయంలో వారికి సేవకుడిగా అందుబాటులో ఉంటానని తెలిపారు. అన్ని శాఖల అధికారులతో సమీక్షిస్తామని చెప్పారు. గత ప్రభుత్వం అన్నిశాఖలను నిర్వీర్యం చేసిందని శంకర్ విమర్శించారు. ప్రతి సచివాలయం పరిధిలో ఎమ్మెల్యేతో ముఖాముఖి కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

● **గార:** గార మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం విత్తనాలు, ప్రకృతి సేద్యం ద్వారా సాగుచేసే రైతులకు విత్తనాలు కిట్లు ఎమ్మెల్యే శంకర్ పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మార్పు ధర్మారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పీసా వెంకట రమణ మూర్తి, మాజీ ఎంపీపీ గుండ భాస్కరరావు, జీవీ రమణ మూర్తి, వెంకట అప్పారావు, కైబాడి రాజు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి కృషి

● ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్

ఇచ్ఛాపురం: పాఠశాలల్లో సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తానని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. మంగళవారం ధర్మపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎస్.విశ్వనాథం అధ్యక్షతన జరిగిన కార్య క్రమంలో పుస్తకాల కిట్లు అందజేశారు.ఈసందర్భంగా మూడేళ్లగా పదో తరగతిలో శతశాతం ఫలితాలు సాధించడా నికి కృషిచేస్తున్న హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులకు, ఈ ఏడాది మార్చిలో పదో తరగతిలో 547మార్కులు సాధించిన కైలాస్ బాడిత్యకు అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో కె.అప్పారావు, హెచ్ఎం విశ్వనాథం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, జనసేన రాష్ట్ర కార్యదర్శి తిప్పన దుర్యోధనరెడ్డి, మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ సాడి సహదేవ్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు..

తులసిగాంలో సచివాలయ భవనం వద్ద అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అశోక్ తెలిపారు. మంగళవారం ఇక్కడ అక్రమ నిర్మా ణాలను గ్రామస్థులతో కలిసి పరిశీలించారు. పట్టాలు లేకుండానే వైసీపీ సానుభూతిపరులు సచివాలయం పక్కనే అక్రమ నిర్మాణాలు చేపట్టారని, ప్రశ్నిస్తే బెదించారని గ్రామస్థులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ నిర్మాణాలపై అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీఇచ్చారు.

● **కవిటి:** ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను సోమవారం రాత్రి ప్రగడపుట్టుగ గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బి.రవి కుమార్, రాంప్రసాద్, పి.బలరాం, పి.సుధాకర్, బిక్కష్టారావు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్

పార్లమెంటరీ పార్టీ నాయకుడికి సన్మానం



లావు శ్రీకృష్ణ దేవరాయలును సన్మానిస్తున్న రామ్మోహన్‌నాయుడు

అరసవల్లి: టీడీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా ఎన్నికైన లావు శ్రీకృష్ణదేవరాయలు, ఇతర టీడీపీ పార్లమెంటు సభ్యులను కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేంద్రసహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో విజయనగరం,విశాఖపట్నం ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, భరత్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి: సీఐ



విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న పోలీసులు, ఎస్ఈబీ సిబ్బంది

ఆమదాలవలస: మాదక ద్రవ్యాలకు ప్రజలు, యువత దూరంగా ఉండాలని సీఐ జి.దివాకర్‌యాదవ్, ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ కె.రాజారావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆమదాలవలస జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణపతి, ధనుంజయరావు, ఎస్ఐ కరుణలత, నాగ రాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి జె.రవిబాబుఆధ్వర్యంలో ఆమదాలవలసలోని ర్యాలీ నిర్వహించి మాదక ద్రవ్యాల నిషేధంపై అవగాహన కల్పించారు.

● **బూర్జ:** యువత మాదక ద్రవ్యాల జోలికి పోయి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ జీవీ ప్రసాద్ కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం



సింహాచలం (ఫైల్)

జలుమూరు: మండలంలోని అబ్బాయిపేట కూడలి వద్ద మంగళవారం రోడ్డు ప్రమాదంలో రాణ గ్రామానికి చెందిన వాన సింహాచలం (72) దుర్మరణం పాలయ్యాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. చల్లవానిపేట వైపు నుంచి ద్విచక్రవాహనంపై అబ్బాయిపేట వైపు వస్తున్న వాన సింహాచలానికి సారవకోట నుంచి నరసన్నపేట వైపు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో అక్క డికక్కడే మృతిచెందాడు. సమాచారం మేరకు ఎస్ఐ మధుసూదనరావు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోటబొమ్మాళి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సింహాచలం కూరగాయలు, చిరువ్యాపారాలు చేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు భార్య ఈశ్వరమ్మ, లింగమూర్తి, గోపాలరావు ఇద్దరు కుమారులు,కుమార్తె ఉన్నారు. సింహాచలం మృతిచెందడంతో భార్య ఈశ్వరమ్మతో పాటు కుటుంబ సభ్యు లు విలపిస్తున్నారు. అందరితో కలివిడిగా ఉండే సింహాచలం మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కాగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు.

ఈదుపురం తోటలో అక్రమంగా ఇసుక నిల్వలు



తోటలో నిల్వచేసిన ఇసుక

ఇచ్ఛాపురం: ఈదుపురం రోడ్డు పక్కన గల తోటల్లో ఇసుక నిల్వలుఉన్నా అధికారులు చర్యలు తీసుకోవడంలేదని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. బాహుదా నది నుంచి వైసీపీనాయకులు అధికార ముందున్న అండతో ఎన్నికల ముందు అక్రమంగా తరలించి నిల్వ చేశారని విమర్శిస్తున్నారు. అక్కడ నుంచి ట్రాక్టరు ఇసుక రూ. 3,500 నుంచి రూ.4000 వరకు విక్రయిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని టీడీపీనాయకులు ఆరోపిస్తున్నారు. రోడ్డు పక్కన తోటలతోపాటు లోపల కూడా ఇసుక నిల్వలు ఉన్నాయని, తక్షణమే సీజ్‌చేయాలని డిమాండ్‌చేస్తున్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని డీసీసీబీ కాలనీలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయం మూడోవార్షికోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా మంగళవారంఅర్చకులు చామర్తి జగన్నాథఆచార్యుల ఆధ్వర్యంలో అష్టోత్తర నామార్చన, మంగళశాసనం, కంకణ బంధనం, మండపారాధన, హోమాలు, అనంతరం వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవ మహోత్సవాలు జరిగాయి.

పరిశోధన రంగంపై దృష్టి: వీసీ



మాట్లాడుతున్న రజని

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో బోధన, పరిశోధనపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్లు వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తెలిపారు. మంగళవారం వర్సిటీ 17వవ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బోధనా, బోధనేతరసిబ్బంది కొరత, వసతులలేమి, ఆర్థిక ఇబ్బందులు తదితరసమస్యలు ఎదుర్కొంటూనేవర్సిటీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు శాయశక్తులా కృషిచేస్తున్నామని తెలిపారు.వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య మాట్లాడుతూ ప్రజాసంఘాలు, మేధావుల పోరాటాల ఫలితంగా ఏర్పడిన ఈ వర్సిటీ ప్రగతి దిశగా పయనించేలా కృషిజరగాలన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, పరీక్షలవిభాగం డీన్‌డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ మాట్లాడుతూ ఉపాధి కోర్సులను గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందుబాటులోకి తేవడంలో వర్సిటీలో ముందంజలోఉందన్నారు.కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజశేఖరరావు, అకడమిక్ ఎఫైర్స్ డీన్ డాక్టర్ కె.స్వప్నవాహిని, సీడీసీ డీన్ డాక్టర్ యు.కావ్యజ్యోత్స్న, చీఫ్ వార్డెన్ డాక్టర్ ఎన్.లోకేశ్వరి, పాలకమండలి సభ్యులు కె.మాధవి, డాక్టర్ కె.చక్రవర్తి తదితరులు మాట్లాడారు.

ఐఎస్‌టీఎస్ఈలో సత్తాచాటిన కంచిలి విద్యార్థులు

కంచిలి: కంచిలి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఇండియన్ స్కూల్ ఆఫ్ ట్యాలెంట్ సెర్చ్‌ఎగ్జామినేషన్‌లో (ఐఎస్‌టీఎస్ఈ) సత్తాచాటారు. 2023-24 విద్యా సంవత్సరానికిగాను జనవరిలో నిర్వహించిన పరీక్షలో ప్రతిభచూపారు.ఈ మేరకు ఐదోతరగతికిచెందిన నర్తురామ్‌రస్వీర్‌కు బంగారు పతకంతోపాటు రూ. 1500 నగదు బహుమతి,లక్ష్మీనారాయణ పాయికోకు వెండిపతకం, కంబాల మహీత్‌రెడ్డికు క్యాంస పతకం లభించాయి. మూడో తరగతికి చెందిన నల్లాన వెనీషాకు, రెండోతరగతికి చెందిన బద్రిశివానికి బంగారు పతకాలు లభించాయి.వీరికి గైడ్‌టీచర్‌గా నల్లాన రవి వ్యవహరించారు. ఈమేరకు ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎంఈవోలు శివరామ్‌ప్రసాద్,చిట్టిబాబు, హెచ్ఎం ఆర్.కామరాజు, ఉపాధ్యాయులుభగవతిరావు, వాసంతి, రవి,డిల్లేశ్వరరావు, శంకరరావు, సంతోష్ కుమార్,నాగరత్నం,పేరెంట్స్ కమిటీ చైర్మన్ వంకల దుర్యోధన అభినందించారు.

పైనాపిల్ విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ

ఆమదాలవలస: పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో పైనాపిల్ విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై గిరిజన యువతకు గృహవిజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత ఆధ్వర్యంలో రెండు రోజుల వృత్తి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పైనాపిల్‌లో ఆస్కార్బిక్ యాంటీ ఆక్సిడెంట్స్ ఉండడం వల్ల శక్తిని పెంపొందించి జీర్ణక్రియ వ్యవస్థ చక్కగా పనిచేస్తుందని తెలిపారు.కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎస్.నీలవేణి, వి.హరికుమార్, ఎస్.అనూష, ఎస్.కిరణ్‌కుమార్, వెలుగు అసోసియేషన్ ఏరియా కోఆర్డినేటర్ ఎస్.ఆనంద్, వసంత, శంకర్ పాల్గొన్నారు.



పలాస: గ్రామదేవతను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే శిరీష



సోంపేట: కోలాటం ఆడుతున్న మహిళలు

గ్రామదేవతలకు చల్లదనోత్సవాలు

జిల్లాలోని పలు చోట్ల మంగళవారం గ్రామదేవతలకు చల్లదనోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

సోంపేట: మండలంలోని పలాసపురంలో గల శ్రీసింధుపట్టపురాణి, ఉగాడ పోలమ్మ, కాళీమాత అమ్మవార్ల చల్లదనోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అష్టోత్తర నామపూజ, కుంకుమార్చన అనంతరం సాముహిక అన్నసమారాధనలో చేపట్టారు. గజముద్దలు, ఘటాలు, కోలాటం, కాళికా వేషధారణలతో ఊరేగింపు నిర్వహించారు.

● **మందస:** మందస కంచుమాయమ్మ అమ్మవారికి మంగళవారం చల్లదనం చేశారు. ఆలయం నుంచి అమ్మవారిని ఊరేగిస్తూ మహిళలు ముర్రా టలు, కలశాలు, ఘటాలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ముర్రాటలు సమర్పించి చల్లదనం చేశారు.

● **పలాస:** పురుషోత్తపురంకాలనీలో గ్రామదేవత ఉత్సవాలు నిర్వహించారు. అమ్మవారిఘటాలను పురవీధుల్లో ఊరేగించారు.ఈసందర్భంగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, యార్లగడ్డ వెంకన్నచౌదరి, రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, లొడగల కామేశ్వరరావుయాదవ్, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, సప్ప నవీన్, అమ్మోజమ్మ, శంకర్, టంకాల రవిశంకర్‌గుప్తా, శ్రీనివాస్, దడియాల నర్సింహులు అమ్మవారిని దర్శించుకున్నారు.

● **ఇచ్ఛాపురం:** బూర్జుపాడులో అసిరిపోలమ్మతల్లి సంబరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు అమ్మవారి ఘటాలను కాళికామాత వేషాలతో ఊరేగించారు. అనంతరం అమ్మవారికి అభిషేకించి మొక్కులు చెల్లించారు.

వర్షంతో రైతులకు ఊరట



హరిపురంలో కురుస్తున్న వర్షం

పలాసరూరల్/మందస/హరిపురం/నందిగాం: పలాస, మందస, నందిగాం మండలాల్లో మంగళవారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో రైతులు ఊరట చెందారు. గడచిన వారం రోజులుగా నారు వేసేందుకు నీరు లేక ఇబ్బందులు పడిన రైతులకు ఈ వర్షం ఉపకరించింది. అలాగే ఎండల తీవ్రతతో అల్లాడిన ప్రజలు కొంత ఉపశమనం పొందారు. మరో రెండు రోజుల పాటు వర్షం పడితే నారుమళ్లు పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందని రైతులు అభిప్రాయపడ్డారు. నందిగాం మండలం పెద్దతామరాపల్లి, దేవళభద్ర, జల్లపల్లి, లఖిదాసుపురం, శివరాంపురం తదితర గ్రామాల్లో వర్షం పడడంతో పొలాల్లో నీరుచేరింది. ఈ వర్షం కొన్నిగ్రామాలకే పరిమితం కావడంతో రైతుల్లో నిరుత్సాహం కలిగింది.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి



ఇచ్ఛాపురం: ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈవో, విద్యార్థులు

ఇచ్ఛాపురం: బడిఈడు పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో కె .అప్పారావు కోరారు. మంగళవారం బెల్లుపడ కాలనీలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో విద్యా ప్రవేశం కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది ఉప్పాడ కామేష్‌రెడ్డి, ఆశి రవికుమార్‌రెడ్డి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

18 ఏళ్ల లోపు పిల్లలంతా బడిలోనే ఉండాలి

టెక్కలి: 18 ఏళ్ల లోపు పిల్లలంతా బడిలోనే ఉండాలని టెక్కలి సహాయ కార్మిక కమిషనర్ రాధా కుమారి అన్నారు. మంగళవారం కోటబొమ్మాళి, టెక్కలి ప్రాంతాల్లో చైల్డ్‌వర్కర్ల నిర్మూ లన కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. 18 ఏళ్ల లోపు వారిని ఎవరైనా దుకాణాల్లో పనిలో పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి



కుసుంపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కవిటి: మలేరియా వ్యాధిపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బొరివంక పీహెచ్‌సీ వైద్యుడు తేజవేంకటేష్ సూచించారు. మంగళవారం కుసుంపురం గ్రామ సచివాలయం పరిధిలో మలేరియా మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఈవో ప్రసాద్, రవిబాబు, పద్మావతి, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల విజయోత్సవాలు



బి.కంచరాంలో మొక్కు చెల్లిస్తున్న నాయకులు

పొందూరు: మండలంలోని పలు గ్రామాల్లో కార్యకర్తలు, నాయ కులు రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటుకావడం, ఆమదాలవలస నియోజకవర్గంలో రవికుమార్ గెలుపొందడంతో విజయోత్సవాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం పొందూరు పంచాయతీ పరిధిలో లక్ష్మీపేట, బి.కంచరాంలో ఉత్సవాలు జరుపుకొన్నారు. బి.కంచరాంలో టీడీపీ మండల ప్రధానకార్యదర్శి వండాన మురళి ఆధ్వర్యంలో అసిరితల్లికి చల్లదనం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రామ్మోహన్, నాయకులు అన్నెపు రాము, బలగ శంకరభాస్కర్, ఎ.చినరంగ, బాడాన గిరి, ఎంపీటీసీలు బి. హారిక, ఎ. వాణి, మాజీ సర్పంచ్ ఎ. విజయలక్ష్మి, అప్పలనాయుడు, యోగి పాల్గొన్నారు.

ఉప్పు ఉత్పత్తిదారుల లీజులు పునరుద్ధరించాలి



ఉప్పు పరిశ్రమ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

సంతబొమ్మాళి: రాష్ట్రంలో ఉప్పు పరిశ్రమ మనుగడకు లీజులను పునరుద్ధరించాలని రాష్ట్ర ఉప్పు ఉత్పత్తిదారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పీరుపల్లి రాజశేఖర్ కోరారు. ఈ మేరకు మంగళవారం కాకినాడలో రాష్ట్ర ఉప్పు పరిశ్రమశాఖకమిషనర్‌ప్రేరణ జోషిని కలిసి వినతిపత్రం అందజేశారు. 2013 నుంచి ఉప్పు ఉత్పత్తిదారుల లీజులు నిలిచిపోవడంతో వేలాదిమంది కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. లీజులు పునరుద్ధరిస్తే స్థానికంగా ఉపాధి లభించి వలసలు తగ్గుతాయన్నారు. లీజులు పున రుద్ధరించడంతో పాటు అసైన్మెంట్ ఫీజులు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

జలుమూరు: భారత రాజ్యాంగ నిర్మాత డా.అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. గొటివాడ పంచాయతీ మూర్తిపేటలో అంబేడ్కర్ విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ.. ప్రతీ దళితవాడలోనూ అంబేడ్కర్ విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇండియన్ ప్రజాబంధు జాతీయపార్టీ సోషల్ జస్టిస్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు అద్దంకి రంజిత్ ఓఫీర్, రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షురాలు మల్లేశ్వరి, దళిత నాయకులు పిల్లి రామారావు, వేల్పుల సత్యనారాయణ, సర్పంచ్ నవిరి పోతయ్య, ఇన్‌చార్జి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, టెక్కలి డీఎస్పీ బాలచంద్రా రెడ్డి ఎస్ఐ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విజయ వినాయక ఆలయ వార్షికోత్సవం

పోలాకి: ఇందిరానగర్ కాలనీలో విజయ వినాయక ఆలయ వార్షికోత్సవం బుధ వారం నిర్వహిస్తున్నట్టు ధర్మకర్తలు సురవరపు సంతోష్, యాబాజి రాము తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. ఈ సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు ఉదయం 9గంటలకు నిర్వహిస్తు న్నామన్నారు. భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని తరించాలని కోరారు.

పిడుగుపడి గడ్డివాముల దగ్ధం

మెళియాపుట్టి: సంతలక్ష్మీపురం గ్రామంలో మంగళవారం సాయంత్రం పిడుగు పడి గ్రామానికి చెందిన రైతు జోగులు పోలయ్యకు చెందిన గడ్డివాము దగ్ధమైంది. అలాగే సమీపంలోని వెదురు డొంకపై పడడంతో అగ్ని రాజుకుంది. స్థానికుల సమాచారం మేరకు పలాస నుంచి అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపుచేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రైతులందరు పొలాల్లో ఉన్నప్పుడు పిడుగులు పడడంతో ఆందోళన చెందారు.

బీఆర్ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ అనూరాధ

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఆర్ట్స్, కామర్స్, లా, ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ)గా సోషల్‌వర్క్ విభాగానికి చెందిన సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఎం.అనూరాధ నియమితులయ్యారు. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత నియామక ఉత్తర్వులు జారీ చేశారు. వర్సిటీలో ఇప్పటికే డాక్టర్ అనూరాధ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు.

రోటరీ సేవలు ప్రశంసనీయం

సోంపేట: సోంపేట రోటరీ సేవలను రొటేరియన్ పీజీడీ జి.విశ్వనాథం ప్రశంసించారు. మంగళవారం సోంపేట రోటరీభవనంలో అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో కార్యదర్శి పీవీ కృష్ణారావు, కోశాధికారి కె.రవి పాల్గొన్నారు.

మిగులు సీట్ల భర్తీకి పరీక్ష

బూర్జ: ఓవీపేట ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతుల్లో మిగిలిఉన్న రెండేసి సీట్లు భర్తీ కోసం గురువారం వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు శనివారం జరిగే ప్రవేశ పరీక్షకు హాజరుకావాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆమదాలవలస: ఆమదాలవలస, బూర్జ ఐసీడీఎస్ ప్రాజెక్టుల అంగన్‌వాడీ కేంద్ర నిర్వాహకులు సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ సంఘ నాయకులు కోరారు. మంగళవారం శ్రీకాకుళంలోని బూర్జ ఐసీడీఎస్ ప్రాజెక్టు నుంచి కె.జ్యోతి, ఎ.రాధిక, బండా రమ్మ, రూప, శ్రీలక్ష్మి, నిర్మల, ఆమదాలవలస ప్రాజెక్టు నుంచి పి.లతాదేవి, పి.భూలక్ష్మి, పి.లక్ష్మి, కె.లత, కె.అరుణ కలిసి సమస్యలు వివరించారు.

వరి విత్తనాలు పంపిణీ



ఎచ్చెర్లలో వరి విత్తనాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు రాజారావు

ఎచ్చెర్ల: మండలంలోని పలు గ్రామాల్లో సబ్సిడీ వరి విత్తనాలను మంగళవారం పంపిణీ చేశారు.ఎచ్చెర్లలో మండల సర్పంచ్‌ల సంఘ మాజీ అధ్యక్షుడు మెండ రాజారావు, మాజీ ఉప సర్పంచ్ మూకళ్ల బాస్కరరావు, ఫూడివలసలో మాజీ సర్పంచ్ గొలివి గోవిందరావు సమక్షంలో విత్తనాలను అందజేశారు.

అంధకారంలో జేఆర్‌పురం

రణస్థలం: జేఆర్‌పురం పంచాయతీ పరిధిలోని కాపు వీధి, ఎస్సీకాలనీ, జాతీయరహదారికి ఇరువైపుల వీధిలైట్లు నెలరోజులుగా పనిచేయకపోవడంతో చీకటిపడితే ప్రజలు అంధకారంతో ఉండాల్సి వస్తోంది. వర్షాకాలం కావడంతో వీధుల్లో పాములు సంచరిస్తుండడంతో రాత్రి పూట వీధి లైట్లు వెలగకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చీకటిల్లో కుక్కలు దాడులు చేస్తున్నాయని ద్విచక్ర వాహనచోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జేఆర్‌పురం పంచాయతీ పరిధిలో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు తన్విక



ఎచ్చెర్ల: మండలంలోని కొంగరాం గ్రామానికి చెందిన గోపిన లక్ష్మీ తన్విక జాతీయస్థాయి విలువిద్య(ఆర్చరీ) పోటీలకు ఎంపికయ్యింది. విజయవాడలోఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి విలువిద్య పోటీల్లో అండర్ -15 కాంపౌండ్ విభాగంలో సత్తా చాటింది. దీంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. శ్రీకాకుళంలో చదువుతున్న తన్విక ఆర్చరీ అకాడమీలో శిక్షణ తీసుకుంటోంది. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన లక్ష్మీ తన్వికను అకాడమీ కోచ్‌లు ఎ.మధుసూదనరావు, ఎ.శ్రీనివాసరావు, ఈశ్వర ప్రసాద్, గోపిన కృష్ణప్రసాద్, పి.గోవిందరావు, శివాజీ, శ్రీనివాసరావు, తిరుపతిరావు అభినందించారు.

జనసేనను బలోపేతం చేయండి

పొందూరు: గ్రామాల్లో గత ప్రభుత్వంలో పరిష్కారం కాని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు పార్టీ నాయకులు కృషిచేయాలని ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్‌కు సూచించారు. మంగళవారం విజయవాడలో పవన్ క్యాంపు కార్యాలయంలో చంద్రమోహన్ పవన్‌కల్యాణ్‌ను కలిశారు. జనసేన సంస్థాగతంగా బలోపేతం కావడానికి పనిచేయాలని సూచించారు.